నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
బుధవారం
23 అక్టోబర్ 2024
పేజీలు: 02




## చైనా అధ్యక్షుడితో ఇవాళ భేటీకానున్న మోదీ

రష్యాలోని కజన్ సిటీలో బ్రిక్స్ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీకానున్నారు. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ ఈ ప్రకటన చేశారు. గత కొన్నాళ్లుగా వాస్తవాధీన రేఖ వద్ద ఉన్న ఉద్రిక్తతలకు రెండు దేశాలు ముగింపు పలికాయి. లడాఖ్‌లో పెట్రోలింగ్ నిర్వహించే అంశంలో డీల్ కుదిరినట్లు రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ అంశంపై ఇరు దేశాధినేతలు బ్రిక్స్ భేటీలో చర్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.



## చలి మొదలైంది..

తెలుగు రాష్ట్రాల్లో చలి మొదలైంది. తెల్లవారుజామున, లేట్ నైట్స్ చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఉన్ని దుస్తులు ధరించి చలి నుంచి రక్షణ పొందాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల జ్వరాల బారినపడే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. మరోవైపు తుఫాన్ ప్రభావంతో ఇరు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో వర్షా లు కురుస్తున్నాయి. ఇక మధ్యాహ్నం సమయంలో ఎండ దంచుతోంది. దీంతో భిన్నమైన వాతావరణం ఉంటోంది.



# ఏపీలో దీపం ధమాకా

## ఉచిత గ్యాస్ సిలిండర్ పొందాలంటే అర్హతలివే




ఆంధ్రప్రదేశ్ లో దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు నిన్ననే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని గ్యాస్ ఏజెన్సీలతో సమీక్షలు జరిపారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను దీపావళి నుంచి పంపిణీ చేయనున్నారు. దీపావళికి దీపం పథకం కింద ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. నిన్ననే అధికారిక ప్రకటన చేసిన చంద్రబాబు నాయుడు అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా పౌర సరఫరాల శాఖ అధికారులతో పాటు గ్యాస్ ఏజెన్సీలను కూడా ఆదేశించారు. ఏడాదికి దాదాపు మూడు వేల కోట్ల రూపాయలు ఈ పథకం కింద ఖర్చవుతుందని అంచనాలను కూడా రూపొందించారు.

దీపం పథకం కింద...అయితే దీపం పథకం కింద ఆంధ్రప్రదేశ్ లో మహిళలు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు పొందాలంటే అందుకు సంబంధించిన అర్హతలు కూడా ఉండాల్సి ఉంటుంది. మహిళందరికీ ఉచిత సిలిండర్లు అందచేయరు. దారిద్ర్యానికి దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే ఈ ఉచిత సిలిండర్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఏడాదికి గ్రామాల్లో రెండు లక్షల రూపాయల ఆదాయం మించకుండా ఉండాలి. పట్టణాల్లో అయితే ఈ పరిమితి మూడు లక్షల వరకూ విధించారు. ఆదాయ పరిమితిని బట్టి మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్లు అందుతాయని పౌరసరఫరాల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అర్హతలివే...

దీంతో పాటు ఆ కుటుంబాలు విధిగా ఆంధ్రప్రదేశ్ లో స్థిర నివాసం ఏర్పరచుకుని ఉండాల్సి ఉంటుంది. గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండాలి. ఆర్థికంగా వెనకబడిన వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. వారే ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. తెలుపు రంగు రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్లు మూడు లభిస్తాయి. రేషన్ కార్డు ప్రామాణికంగా మాత్రమే తీసుకుని ఈ పథకాన్ని వర్తింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీపావళికి ఇంకా వారం రోజులు మాత్రమే సమయం ఉండటంతో దరఖాస్తు చేసుకుని తాము ఈ పథకానికి అర్హులని వారికి వారే పౌరసరఫరాల శాఖకు తెలియజేయాల్సి ఉంటుంది.



## దానా తుఫాన్ ఎఫెక్ట్.. నేడు రద్దయిన రైళ్లు

దానా తుఫాన్ ప్రభావంతో వివిధ మార్గాల్లో 41 రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. తుఫాను వల్ల ఒడిశా తీరప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో బుధవారం నుంచి ఈ నెల 27 వరకు పలు రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. రద్దయిన రైళ్లలో భువనేశ్వర్, హౌరా, ఖరగ్‌పూర్, పూరీ, తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు, రామేశ్వరం, సికింద్రాబాద్, తిరుపతి , షాలీమార్, మాల్డా, గౌహతి, కన్యాకుమారి, చెన్నై, గోవా తదితర ప్రాంతాలకు వెళ్లేరైళ్లే ఎక్కువగా ఉన్నాయి.

**బుధవారం రద్దయిన రైళ్లు ఇవే..**

సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-హౌరా, సికింద్రాబాద్-హౌరా, సికింద్రాబాద్-మాల్దా, షాలిమార్-హైదరాబాద్ రైళ్లు ఉన్నాయి. ఇక గురువారం వెళ్లనున్న హౌరా-సికింగ్రాబాద్, షాలిమార్-హైదరాబాద్, సిల్చార్-సికాంద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి.

## హాట్ లుక్స్‌లో సమంత

'కెమెరా ముందు నేను నిల్చున్న చోటే.. ప్రపంచంలో నాకు బాగా ఇష్టమైన చోటు' అంటున్నది అగ్ర కథానాయిక సమంత. వచ్చే నెల నుంచి సామ్ సినిమాలతో బిజీ కానున్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తనకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు వెల్లడించింది సమంత.'నేను మునుపటికంటే స్ట్రాంగ్‌గా ఉన్నాను. నా జీవనశైలిని మార్చుకోవడం వల్లే ఈ మార్పు సాధ్యమైంది. మనలోని బలహీనతల్ని ఎలాగైనా అధిగమించాలని అందరం అనుకుంటాం. కానీ చంచలమైన మన మనసు వాటిని అధిగమించనివ్వదు. దానికి కళ్లెం వేయాలంటే ఆధ్యాత్మికతకు మించిన దారిలేదు. గత మూడేళ్లలో ఎదురైన సమస్యలవల్ల మానసికంగా కృంగిపోయిన నన్ను ఆధ్యాత్మిక మార్గమే మనిషిని చేసింది. ఇప్పుడు నేను మానసికంగా కూడా బలంగా ఉన్నా.' అని చెప్పుకొచ్చింది సమంత.





పులివెందుల వద్ద లోయలో పడిన ఆర్టీసీ బస్సు..

## 30 మందికి గాయాలు


ఆర్టీసీ బస్సు లోయలో పడడంతో దాదాపు 30 మందికి గాయాలైనట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ లోని పులివెందుల వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు అదుపుతప్పి 30 అడుగుల లోయలో పడిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా గాపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమం తెలుస్తోంది. దీంతో చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కదిరి నుంచి పులివెందులకు బస్సు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైసీపీకి మరో బిగ్ షాక్.. వాసిరెడ్డి పద్మ గుడ్ బై



ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీకి నేతలు ఒక్కొక్కరుగా గుడ్ బై చెబుతున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు రాజీనామా చేశారు. తాజాగా తాజాగా మరో సీనియర్ మహిళా నేత, మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ కూడా పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పద్మ ఇవాళ అధికారికంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్‌సీపీని వీడటానికి కారణాలను ఆమె వెల్లడించే అవకాశం ఉంది. ఏపీ ఎన్నికల ఫలితాల తర్వాత వాసిరెడ్డి పద్మ ఎక్కడా పెద్దగా కనిపించలేదు.. వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.వాసిరెడ్డి పద్మ వైఎస్సార్‌సీపీని వీడటానికి కారణాలపై చర్చ జరుగుతోంది.

## ఒంటరితనం యమా డేంజర్



ఒంటరితనంతో ప్రస్తుత రోజుల్లో ఎంతో మంది బాధపడుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్న యువత సైతం దీని బారిన పడుతున్నారు. అయితే ఇలా సామాజిక సంబంధాలు సరిగా లేక అసంతృప్తితో బతికేవారు డిమెన్షియా బారిన పడే అవకాశం 30% పెరిగిందని పరిశోధనలో తేలింది. 6 లక్షల మందిపై జరిపిన అధ్యయనంలో శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని తేల్చారు. డిమెన్షియాతో వ్యక్తి ఆలోచనలు, జ్ఞాపకశక్తి, నిర్ణయాలు తీసుకోవడం వంటివి ప్రభావితం అవుతాయని తెలిపారు.




## "కేజీయఫ్ 3" పై యష్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ వైరల్

కన్నడ సినిమా దగ్గర సెన్సేషనల్ హిట్ సినిమా ఫ్రాంచైజ్ "కేజీయఫ్" కోసం అందరికీ తెలిసిందే. మరి రాకింగ్ స్టార్ యష్ హీరోగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన ఈ బిగ్గెస్ట్ యాక్షన్ సినిమాలు పాన్ ఇండియా లెవెల్లో ట్రెండ్ సెట్ చేసాయి. ఇక ఈ రెండు భారీ హిట్ సినిమాలకి పార్ట్ 3 ని కూడా మేకర్స్ కన్ఫర్మ్ చేయగా ఈ సినిమా ఖచ్చితంగా ఉంటుంది అని ప్రశాంత్ నీల్ కూడా కన్ఫర్మ్ చేసాడు. అయితే ఇప్పుడు పార్ట్ 3 పై యష్ మాట్లాడ్డం జరిగింది. కేజీయఫ్ చాప్టర్ 3 చేస్తానని ఇప్పుడు చేస్తున్న టాక్సిక్ అలాగే బాలీవుడ్ లో రామాయణ సినిమాల తర్వాత చేసేది ఆ సినిమానే అంటూ తాను రీసెంట్ గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. దీనితో ఈ సినిమాలు చేసిన పిదప యష్ ఈ బిగ్గెస్ట్ సీక్వెల్ ని చేయడం అయితే కన్ఫర్మ్ అని తేలిపోయింది. మరి ప్రస్తుతం అయితే ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్, ప్రభాస్ లతో కూడా సినిమాలు చేయాల్సి ఉంది.

## హసన్ నస్రల్లా వారసుడిని చంపేశాం.. ధ్రువీకరించిన ఇజ్రాయెల్ సైన్యం

హెజ్‌బొల్లాకు మరో భారీ షాక్ తగిలింది. ఆ గ్రూప్ చీఫ్ హసన్ నస్రల్లా హత్య తర్వాత అతని బంధువు హషీమ్ సఫీద్దీన్‌ను వారసుడిగా అందరు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇజ్రాయెల్ దాడుల్లో సఫీద్దీన్ మృతి చెంది ఉండొచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు ప్రసారం చేసింది. తాజాగా ఈ విషయాన్ని ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. ఈ మేరకు ఐడీఎఫ్ ఓ ప్రకటనను విడుదల చేసింది. అయితే, సుమారు మూడు వారాల క్రితం జరిగిన దాడిలో హెజ్‌బొల్లా కార్యనిర్వాహక మండలి అధిపతి, జిహాద్ కౌన్సిల్లో సభ్యుడు హషీమ్ సఫద్దీన్ చనిపోయాడు. అతనితో పాటు హెజ్‌బొల్లా ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ అధిపతి అలీహుస్సేన్ హజిమా, ఇతర హెజ్‌బొల్లా కమాండర్లు మరణించినట్లు ధ్రువీకరించామని ఐడీఎఫ్ ఆ ప్రకటనలో వెల్లడించింది. మరోవైపు, ఈ దాడి జరిగిన సమయంలో హెజ్‌బొల్లాకు చెందిన 25 మందికి పైగా మిలిటెంట్లు ఆ ప్రాంతంలో ఉన్నట్లు ఏరియల్ ఇంటెలిజెన్స్ పేర్కొంది. ఇక, లెబనాన్‌లోని దాహియాలో ఓ బంకర్‌లో సీనియర్ హెజ్‌బొల్లా నేతలతో హషీమ్ భేటీ నిర్వహించారనే.. పక్కా సమాచారంతో ఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి. ఈ దాడుల్లో లెబనీస్ గూఢాచార విభాగం అధిపతి హుస్సేన్ అలీ హాజిమాతో పాటు సఫీద్దీన్ చనిపోయారని ఐడీఎఫ్ ధ్రువీకరించింది. అయితే ఈవిషయంపై హెజ్‌బొల్లా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా, 2017లో హషీమ్ సఫీద్దీన్ ను అమెరికా ఉగ్రవాదిగా ప్రకటించింది.





## బాంబు బెదిరింపులతో
# 600 కోట్ల మేర నష్టం!

దేశంలో విమానాలకు బాంబు బెదిరింపులు పెద్ద సమస్యగా మారిపోయింది. ఫోన్‌లు, ఈమెయిళ్లు, సోషల్ మీడియా ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు చేస్తున్న బెదిరింపులతో విమాన ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. బాంబు బెదిరింపులను అడ్డుకునేందుకు భద్రతా సంస్థలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి హెచ్చరించినప్పటికీ దుశ్చర్యలు ఆగడం లేదు. గత తొమ్మిది రోజుల్లోనే 170 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. విమానాలకు వస్తున్న బెదిరింపులన్నీ నకిలీవే. ఇంతకుముందు అడపాదడపా ఇలాంటి బెదిరింపులు వచ్చేవి. ఇవి చాలావరకు ఆకతాయిలు చేసే పనులే అయి ఉండేవి. ఇప్పుడు మాత్రం ఒకేసారి పెద్ద ఎత్తున బెదిరింపులు వస్తుండటంతో కుట్రకోణం ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటికి తోడు నవంబరు 1 నుంచి 19 వరకు ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని ఖలిస్థానీ ఉగ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ హెచ్చరించాడు. దేశంలో విమానయాన రంగానికి ఆటంకం కలిగిస్తున్న బాంబు బెదిరింపులకు అడ్డుకట్ట వేయడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. బెదిరింపులకు పాల్పడే వారిని నో ఫ్లై లిస్టులో చేర్చి ఎప్పడూ విమానాలు ఎక్కకుండా నిషేధించాలని విమానయాన శాఖ భావిస్తున్నది. దీంతో పాటు బెదిరింపులకు పాల్పడిన వారిని వారెంట్ లేకుండా అరెస్టు చేసేలా సప్రెషన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్ట్స్ అగైనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్(స్వాస్కా చట్టం)-1982కు సవరణ చేయాలని నిర్ణయం తీసుకుంది.



## బీరూట్‌పై ఇజ్రాయెల్
# భీకర దాడి.. 12 మంది మృతి

లెబనాన్‌లోని ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లా స్థావరాలను ఇజ్రాయెల్ టార్గెట్ చేసుకుంటోంది. తాజాగా ఇజ్రాయెల్ వైమానిక దళం బీరుట్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 12 మందికి పైగా జనం మృతిచెందారు. అలాగే లెబనాన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి భారీ నష్టం వాటిల్లింది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో మరో 57 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దక్షిణ బీరుట్ శివార్లలోని రఫిక్ హరిరి యూనివర్శిటీ హాస్పిటల్ సమీపంలోని పలు భవనాలు ఈ దాడిలో ధ్వంసమయ్యాయి. హెజ్‌బొల్లా స్థావరాలపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం స్పష్టంగా తెలియజేయలేదు. మరోవైపు హెజ్‌బొల్లా కూడా సెంట్రల్ ఇజ్రాయెల్‌లోకి పలు రాకెట్లను వదలడం ద్వారా ప్రతీకారం తీర్చుకుంది. అయితే ఈ దాడులతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలుస్తోంది. గాజా కాల్పుల విరమణ చర్చలను పునఃప్రారంభించే లక్ష్యంతో అమెరికా విదేశాంగ మంత్రి ఆంథోనీ బ్లింకెన్ ఇక్కడకు చేరుకోవడానికి కొన్ని గంటల ముందు ఈ దాడి జరిగింది. ఇదిలావుండగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ.. హమాస్‌ను మట్టుబెట్టి, అక్కడ బందీలుగా ఉన్న ప్రజలను విడిపిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు పాలస్తీనా ఖైదీల విడుదలకు బదులుగా మాత్రమే వారి బందీలను విడుదల చేస్తామని హమాస్ ప్రకటించింది. గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేశారు. ఈ ఉగ్రదాడిలో దాదాపు 1,200 మంది మరణించగా, 250 మంది జాడ తెలియరాలేదు. అప్పటి నుండి ఇజ్రాయెల్ వరుసగా హమాస్ స్థానాలపై దాడి చేస్తూవస్తోంది. గాజాలో ఇజ్రాయెల్ ఎదురుదాడిలో 42 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మృతిచెందారని స్థానిక ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఈ యుద్ధంతో గాజాలో చాలా ప్రాంతం ధ్వంసమైంది. అక్కడి జనాభాలో 90 శాతం మంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు.




## అయ్యప్ప భక్తులకు
# గుడ్ న్యూస్

శబరిమలలో అయ్యప్ప స్వామి దర్శించుకోవాలని ఎంతో ఆశతో ఉంటారు అయ్యప్పస్వామి భక్తులు. అలాంటి వారి కోసమే ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC) మంచి ఛాన్స్ తీసుకొచ్చింది. ఎలాంటి టెన్షన్ లేకుండా శబరిమల యాత్ర పూర్తి చేసుకునేలా అవకాశం కల్పించింది. భారత్ గౌరవ్ టూరిస్టు రైళ్ల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించి ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు కొనసాగనున్న ఈ యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ సోమవారం విడుదల చేశారు.

* నవంబర్ 16వ తేదీన ఉదయం 8గంటలకు ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి బయలు దేరుతుంది. రాత్రంగా ప్రయాణం ఉంటుంది.
* రెండోరోజు ఉదయం 7 గంటలకు కేరళలోని చెంగనూర్‌కు చేరుకుంటుంది. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నీలక్కళ్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. తర్వాత ఆర్టీసీ బస్సులో పంబ వరకు ప్రయాణం ఉంటుంది. రాత్ర బస అక్కడే ఉంటుంది.
* ఇక మూడో రోజు దర్శనం, అభిషేకంలో పాల్గొంటారు. అనంతరం మధ్యహ్నం 1 గంటకల్లా నీలక్కళ్‌నుంచి చోటానిక్కర/ఎర్నాకుళం చేరుకుంటారు. రాత్రి బస అక్కడే ఉంటుంది.
* 4వ రోజు ఉదయం 7గంటలకు చోటానిక్కర అమ్మవారి ఆలయ దర్శనం చేసుకుంటారు. ఆ తర్వాత స్థానికంగా ఉండే రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణం మొదలవుతుంది. మధ్యాహ్నంగా 12 గంటలకు రైలు బయలుదేరి అదే రోజు రాత్రి 9.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకోవడంతో టూర్ ముగుస్తుంది.




## అక్టోబర్ 27 నుంచి
# ఓటిటిలో సత్యం సుందరం

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ అలాగే అరవింద స్వామి కాంబినేషన్ లో దర్శకుడు సి ప్రేమ్ కుమార్ తెరకెక్కించిన బ్యూటిఫుల్ ఎమోషనల్ డ్రామా చిత్రం “సత్యం సుందరం” కోసం తెలిసిందే. మరి తెలుగు సహా తమిళ్ లో మంచి విజయాన్ని అందుకున్న ఈ సినిమా థియేటర్స్ లో రన్ అయితే పూర్తి చేసుకుంది. ఇక ఈ సినిమా ఓటిటి రిలీజ్ కి సిద్ధం అయ్యింది. మరి ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా అందులో ఈ సినిమా ఈ అక్టోబర్ 27 నుంచి పాన్ ఇండియా భాషల్లో వస్తుంది అని ముందు తెలిపారు కానీ దానిని ఈ అక్టోబర్ 25 కి షిఫ్ట్ చేశారు. అయితే దీనితో పాటుగా ఓ ఇంట్రెస్టింగ్ మార్పుతో ఈ సినిమా రాబోతున్నట్టుగా తెలుస్తుంది. నిజానికి ఈ సినిమా రన్ టైం థియేటర్స్ లో 2 గంటల 55 నిమిషాలకి పైమాటే.. కానీ దీనిని ఓటిటి వెర్షన్ లో మాత్రం 2 గంటల 38 నిమిషాలకి కట్ చేశారు. సో థియేట్రికల్ వెర్షన్ అయితే ఇందులో రావడం లేదని చెప్పాలి.




## గడ్డం, మీసాలు పెంచొద్దు.. షూ అస్సలు వేసుకోవద్దు..
# కాలేజీలో ర్యాగింగ్ కలకలం

ర్యాగింగ్ విషయంలో ప్రభుత్వాలు, అధికారులు ఎన్ని వార్నింగ్‌లు ఇచ్చినా ఏదో ప్రాంతంలో దాని జాడ వెలుగులోకి వస్తుండడం భయపెడుతోంది. తాజాగా.. కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ జరిగినట్లు పెద్దయెత్తున ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వారం రోజుల క్రితం కాలేజీలో చేరిన ఎంబిబిఎస్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్‌ని సీనియర్స్ ర్యాగింగ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఫ్రెషర్స్ ఎవరూ గడ్డం పెంచరాదని.. మీసాలు పెంచరాదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అలాగే.. హాస్టల్లో ప్లేట్లలో భోజనం పెట్టుకుని తీసుకురావాలని.. తిన్న ప్లేట్లను కడగాలని ర్యాగింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాము చెప్పిన యాప్‌లలో మాత్రమే బుక్స్ కొనాలని, ఎవరూ షూ వేసుకుని రాకూడదని ఆదేశించినట్లు కూడా మెడికల్ కాలేజ్ పరిసరాల్లో టాక్ నడుస్తోంది. ఈ క్రమంలోనే.. సీనియర్ల వేధింపులు తట్టుకోలేక కొందరు ప్రెషర్స్ తల్లిదండ్రులు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ దృష్టికి తీసుకెళ్లారు. అయితే.. ర్యాగింగ్ విషయం తన దృష్టికి రాలేదని.. ఆరోపణల నేపథ్యంలో స్పెషల్ ఫోకస్ పెడతామన్నారు. కాలేజీలో ర్యాగింగ్ జరుగుతుందా లేదా అనేదానిపై ఐదుగురితో నిజనిర్ధారణ కమిటీ వేసినట్లు తెలిపారు. ఒకవేళ ర్యాగింగ్ జరిగినట్లు తేలితే కమిటీ నివేదిక ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు కాలేజ్ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ. ఇక.. మూడు రోజుల క్రితమే స్వయంగా కర్నూలు జిల్లా ఎస్పీ సమావేశం ఏర్పాటు చేసి ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ.. పోలీసు ఉన్నతాధికారుల వార్నింగ్ తర్వాత కూడా కర్నూలు మెడికల్ కాలేజ్‌లో ర్యాగింగ్ వెలుగులోకి రావడంపై సీరియస్ అయ్యారు. ర్యాగింగ్ జరిగినట్లు ప్రచారం జరగడంతో పోలీసులు కాలేజీకి హాస్టల్‌కి వెళ్లి పరిశీలించినట్లు తెలుస్తోంది.



# కిల్లింగ్ లుక్స్‌తో ప్రగ్యా జైస్వాల్

హిందీ సినిమా 'ఖేల్ ఖేల్ మే' సినిమాలో 'హౌలీ హౌలీ' సాంగ్ గురువారం విడుదల చేశారు. ఆ కార్యక్రమంలో ప్రగ్యా జైస్వాల్ సెంట్రాఫ్ ఎట్రాక్షన్ అయ్యారు. తెలుగు ప్రేక్షకులు ఒక్క క్షణం షాక్ అయ్యే మూమెంట్ ఇది. తమ కళ్లను తాము నమ్మలేని పరిస్థితి. వరుణ్ తేజ్ 'కంచె' సినిమాలో క్యూట్ క్యూట్ స్మైల్ తో మెస్మరైజ్ చేసిన ప్రగ్యా జైస్వాల్ ను చూసి... ఆ అమ్మాయే ఈ హీరోయినా? అనుకునే రేంజ్ ట్రాన్స్ఫర్మేషన్ కదూ ఇది. హిందీ సినిమా ప్రమోషన్స్ కోసం ఆవిడ ఇలా రెడీ అయ్యారు.ప్రగ్యా జైస్వాల్ నటించిన లేటెస్ట్ హిందీ సినిమా 'ఖేల్ ఖేల్ మే'. అక్షయ్ కుమార్, వాణీ కపూర్ జంటగా నటించారు. ఆ సినిమాలో ఆదిత్య సీల్ కు జంటగా ప్రగ్యా జైస్వాల్ నటించారు. ఆ సినిమాలో 'హౌలీ హౌలీ' పాటను గురువారం విడుదల చేశారు. ఆ కార్యక్రమంలో ప్రగ్యా జైస్వాల్ ఇలా సందడి చేశారు. 'ఖేల్ ఖేల్ మే' సినిమాలో తాప్సీ పన్ను కూడా నటించారు. పంజాబీ గాయకుడు, హీరో అమ్మీ విర్క్ సరసన కథానాయిక పాత్ర చేశారు. గురువారం జరిగిన సాంగ్ లాంచ్ లో ఆవిడ కూడా ఉన్నారు. అయితే... అందరి కళ్లు ప్రగ్యా జైస్వాల్ మీద ఉన్నాయి.